కమనీయం సీతారాముల కల్యాణం


హుకుంపేట మండలం గడుగుపల్లిలో పూజలందుకున్న సీతారాములు

- జిల్లాలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పాడేరులోని సుంద్రుపుట్టు వీధి మొదలుకుని వాడవాడలా సీతారాముల కల్యాణాన్ని కనులవిందుగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే రామాలయాలకు భక్తులు తరలివచ్చారు. అర్చకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. స్థానిక సుంద్రుపుట్టులో, మండలంలో సూకూరుపుట్టు, ఇరడాపల్లి, కిండంగి, సలుగు, హుకుంపేట మండలం గడుగుపల్లిలో అత్యంత వైభవంగా శ్రీరామనవమి వేడుకలు జరిపారు. ఎక్కడ చూసినా భక్తుల సందడి కనిపించింది. - ఆంధ్రజ్యోతి/పాడేరు

ఎన్నికలకు నగారా



నేడు నోటిఫికేషన్ జారీ
- 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ
- 25వ తేదీ వరకు ప్రక్రియ

- 26న పరిశీలన, 29న ఉపసంహరణ
- కలెక్టరేట్‌లో పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయం
- ఐటీడీఏలో అరకులోయ అసెంబ్లీ స్థానం ఆర్వో ఆఫీస్
- పాడేరు ఆర్వోగా జేసీ భావన వశిష్ఠ, అరకులోయ ఆర్‌వోగా ఐటీడీఏ పీవో వి.అభిషేక్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కదన రంగానికి నగరా మోగుతోంది. ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఉదయం 11 గంటల నుంచే నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దిగే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రెండు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాలను పాడేరులోనే ఏర్పాటు చేశారు.

పాడేరు ఆర్వోగా జాయింగ్ కలెక్టర్ భావన వశిష్ఠ వ్యవహరిస్తుండడంతో కలెక్టరేట్‌లోనే ఆర్వో కార్యాలయాన్ని సిద్ధం చేశారు. అలాగే అరకులోయ ఆర్వోగా ఐటీడీఏ పీవో వి.అభిషేక్ కావడంతో ఆర్వో కార్యాలయాన్ని ఐటీడీఏలోనే ఏర్పాటు చేశారు. దీంతో పాడేరు ఎమ్మెల్యేగా బరిలోకి దిగే అభ్యర్థులు నామినేషన్ దాఖలకు కలెక్టరేట్‌కు వెళ్లాల్సి ఉండగా, అరకులోయ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు నామినేషన్ వేసే అభ్యర్థులు ఐటీడీఏ కార్యాలయానికి రావాల్సి ఉంది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలైన పాడేరు, అరకులోయలోని తహసీల్దార్లు కల్యాణ చక్రవర్తి, సోమేశ్వరరావు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.


ఐటీడీఏలో ఏర్పాటు చేసిన అరకులోయ అసెంబ్లీ స్థానం ఆర్‌వో కార్యాలయం, (ఇన్‌సెట్‌లో) అరకులోయ ఆర్వో వి.అభిషేక్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పాడేరు అసెంబ్లీ స్థానం ఆర్‌వో కార్యాలయం (ఇన్‌సెట్‌లో) పాడేరు ఆర్‌వో భావన వశిష్ఠ

25 వరకు నామినేషన్ల స్వీకరణ

గురువారం మొదలయ్యే నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 25 వరకు కొనసాగుతుంది. అలాగే ఆర్వోలు స్వీకరించిన ఆయా నామినేషన్లను 26న పరిశీలిస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి సక్రమంగా లేని నామినేషన్లను అధికారులు తిరస్కరిస్తారు. నామినేషన్లను దాఖలు చేసిన అభ్యర్థులు తమ అభిప్రాయం మేరకు ఈ నెల 29న వాటిని ఉపసంహరించుకోవచ్చు. ఎమ్మెల్యేగా నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల వివరాలు

ఏజెన్సీలో పాడేరు అసెంబ్లీ స్థానంలో ... మిగతా 8వ పేజీలో

సచివాలయాలకు సొంత గూడు ఎన్నడో ?

మండలంలో 16 భవనాలు నిర్మించాలని నిర్ణయం

- ఇప్పటికి ఒక్కటి మాత్రమే అందుబాటులోకి..
- మిగతావన్నీ అసంపూర్తిగా దర్శనం
- వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న సచివాలయాలు


జామిగూడ సచివాలయ భవన నిర్మాణం కోసం తీసిన పునాది గోతులు

పెదబయలు, ఏప్రిల్ 17:

వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన గ్రామ సచివాలయాలకు మండలంలో సొంత గూడు లేకుండాపోయింది. మండలంలో 16 సచివాలయ భవనాలు నిర్మించాలని నిర్దేశించగా ఒక్కటి మాత్రమే పూర్తయింది. మిగతావన్నీ అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడం వల్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

మండలంలో 23 పంచాయతీలకు గాను 16 సచివాలయాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.43 లక్షల 60 వేలతో నిర్మించాలని నిర్ణయించింది. మొత్తం 16 సచివాలయాలను రూ.69 కోట్ల 7 లక్షల 60 వేలతో నిర్మించాలని ప్రణాళిక వేసుకుంది. 2020 మార్చి నెలలో అధికారులు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కరోనా సమయంలో, ఆ తరువాత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేశారు. బిల్లులు రాని కారణంగా గత ఏడాది ఆగస్టు నెలలో పనులను ... మిగతా 8వ పేజీలో

జన చైతన్యం

- దేశం కంచుకోట సాత్
- అక్కడ నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేలు
- నాడు నియోజకవర్గ కేంద్రంగా రేవిడి

·7లో

సివిల్స్‌లో మెరిసిన గిరి పుత్రుడు

- 545వ ర్యాంక్ సాధించిన నరేంద్ర పడాల్
- మన్యం వాసుల హర్షం


పీహెచ్.నరేంద్రపడాల్

పాడేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో గిరి పుత్రుడు సత్తా చాటాడు. యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2023 ఫలితాలు మంగళవారం విడుదల కాగా, జిల్లాకు చెందిన గిరి పుత్రుడు చిట్టపులి నరేంద్ర పడాల్ 545 ర్యాంక్ సాధించాడు. హుకుంపేట మండలం అండింభ గ్రామానికి చెందిన డాల్ పడాల్, విజయభారతి దంపతులు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోనే సెటిలయ్యారు. వారి కుమారుడైన నరేంద్ర పడాల్ విద్యాభ్యాసమంతా అక్కడే జరిగింది. ప్రస్తుతం ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తూ సివిల్స్ ప్రిపరేషన్‌లో భాగంగా నారాయణ ఐఏఎస్ అకాడమీలో చేరారు. 2023 సివిల్స్ పరీక్షలకు హాజరైన నరేంద్ర పడాల్ 545 ర్యాంక్ సాధించారు. జిల్లాకు చెందిన గిరి పుత్రుడు సివిల్స్‌లో ప్రతిభ చూపడంపై మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

ఫీజు పరేషాన్



ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులతో విద్యార్థుల అవస్థలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ పరిధిలోని దొండపర్తి ప్రాంతంలో ఉంటున్న రామ్ వెంకటకృష్ణ ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనలియర్ చదువుతున్నాడు. కొద్దిరోజుల్లోనే కాలేజీ నుంచి రిలీవ్ అవుతుండడంతో ఈలోగా ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యం షరతు పెట్టింది. ప్రభుత్వం 'విద్యా దీవెన' డబ్బులు తమకు ఇవ్వలేదని చెప్పినా వినలేదు. ఫీజు బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే ఫైనల్ సెమిస్టర్ పరీక్షలకు, ప్రాజెక్టు వర్క్‌కు అనుమతిస్తామని స్పష్టంచేసింది. అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వెంకటకృష్ణ తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజు చెల్లించాల్సి వచ్చింది.

- గతంలో కాలేజీలకు నేరుగా చెల్లింపు
- వైసీపీ వచ్చాక మార్పు... 'జగనన్న విద్యా దీవెన' ప్రారంభం
- విద్యార్థుల తల్లి ఖాతాకు డబ్బులు జమ చేస్తామని ప్రకటన
- అవి సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు
- బకాయిలు కట్టకుంటే పరీక్షలకు అనుమతించబోమంటున్న యాజమాన్యాలు
- అప్పోసొప్పు చేసి కట్టాల్సిన పరిస్థితి
- వసతి దీవెనలోనూ కత్తెర

...ఒక్క వెంకటకృష్ణే కాదు. గడిచిన నాలుగేళ్లుగా జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. 'విద్యా దీవెన' పేరుతో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందిపడుతు న్నారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఈ విధానంలో ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే విద్యార్థుల ఫీజును యాజమాన్యాలకు ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తోంది. ఏ ప్రభుత్వం ఉన్నా ఈ పథకంలో మార్పులు చేయలేదు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలేజీలకు నేరుగా ఫీజులు చెల్లించే విధానానికి స్వస్తి చెప్పింది. 'జగనన్న విద్యాదీవెన' పేరుతో 2020-21 విద్యా సంవత్సరం నుంచి ఫీజులను విద్యార్థి తల్లి అకౌంట్‌కు జమ చేయడం ప్రారంభించింది. వారు ఆ డబ్బును డ్రా చేసి కళాశాలలకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయడం వల్ల రాజకీయంగా తమకు ప్రయోజనం ఉంటుందని అధికార పార్టీ భావించింది. అయితే, ఈ నూతన విధానం విద్యార్థులకు అనేక చిక్కులు తెచ్చి పెట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం ఉన్నప్పుడు కాలేజీలకు ప్రభుత్వం ఫీజులు చెల్లించిందా?, లేదా?...అనే విషయంతో విద్యార్థులకు సంబంధం ఉండేది కాదు. విద్యార్థుల వద్ద యాజమాన్యాలు ఫీజుల ప్రస్తావన తెచ్చేవి కాదు. చెల్లింపుల్లో ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం, కళాశాలల యాజమాన్యాలు చూసుకునేవి.

జమ చేయకపోయినా..విద్యార్థులు చెల్లించాలి

కాలేజీకి చెల్లించాల్సిన ఫీజును ఏడాదికి నాలుగు విడతల్లో విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాన్ని ప్రారంభించిన తొలి విద్యా సంవత్సరమైన 2020-21లో మాత్రమే దీనిని పక్కాగా అమలు చేసింది. నాలుగు విడతలు చెప్పిన ట్టుగా జమ చేసింది. ఆ తరువాత విద్యా సంవత్సరం నుంచి ముందుగా ప్రకటించిన షెడ్యూల్ (మూడు నెలలకు ఒకసారి) కంటే రెండు, మూడు నెలలు ఆలస్యంగా ఫీజులను జమ చేయడంతో...కాలేజీ యాజమాన్యాల నుంచి ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వం ఫీజు చెల్లించకపోయినా ఇంజనీరింగ్/డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు/తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజు కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. విద్యార్థులు కావడంతో కాలేజీ యాజమాన్యాలను గట్టిగా అడగలేని పరిస్థితి.

వందలాది మంది విద్యార్థులకు నష్టం

నాలుగు విడతల్లో విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం..గడిచిన రెండేళ్లుగా ఏడాదికి మూడుసార్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో అనేక కోర్సులు చేసిన విద్యార్థులకు ప్రభుత్వం రెండు విడతల ఫీజులను బకాయిపడింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇప్పటివరకు ప్రభుత్వం ఒకే ఒక్క విడత ఫీజును జమ చేసింది. మిగిలిన మూడు విడతల ఫీజు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. యథా మాదిరిగానే కాలేజీల నుంచి ఒత్తిడి రావడంతో విద్యార్థులు/తల్లిదండ్రులు అప్పోసొప్పో చేసి ఫీజులు చెల్లించి పరీక్షలకు హాజరవుతున్నారు. ఇకపోతే, ప్రతి విడతలోనే సాంకేతిక అంశాలు, ఇతర సమస్యలను చూపించి ఎంతోమందిని అనర్హులుగా చూపిస్తూ విద్యా దీవెనలో కోత విధించింది. ఇలా గడిచిన నాలుగేళ్లలో కనీసం ఒక్కో విడత సొమ్మును కోల్పోయిన విద్యార్థులు వేలల్లో ఉన్నారు.

భారీగా విద్యార్థులు

డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల విద్యార్థులకు విద్యా దీవెన పథకం వర్తిస్తోంది. ఏటా ఆయా కోర్సుల్లో చేరే విద్యార్థులు సంఖ్య సుమారు 45 వేల వరకూ ఉంటోంది. ఇక, విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు విషయంలోనూ ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో

చెట్టును ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- పెదకోట పంచాయతీ చటాకంబ నుంచి జీనబాడు పంచాయతీ పెదగంగవరం వెళుతుండగా ప్రమాదం


సంఘటన స్థలంలో మృతిచెందిన సోమెల నాగరాజు, మామిడి రవి

అరకులోయ/దేవరాపల్లి, ఏప్రిల్ 17:

అనంతగిరి మండలం పినకోట పంచాయతీ వెలగలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ చటాకంబకు చెందిన సోమెల నాగరాజు (25), మామిడి రవి(18), గెమ్మెల శివాజీ అలియాస్ రాజు(17)లు జీనబాడు పంచాయతీ పెదగంగవరంలో టెంట్ హౌస్, లైటింగ్ పనుల కోసం బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పినకోట పంచాయతీ వెలగలపాడు వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొన్నది. అంతటితో ఆగకుండా లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సోమెల నాగరాజు, వెనుక కూర్చున్న వారిలో మామిడి రవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మధ్యలో కూర్చున్న గెమ్మెల శివాజీకి తీవ్ర ... మిగతా 8వ పేజీలో

తగ్గని భానుడి ప్రతాపం

- కొయ్యూరులో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పాడేరు- అరకులోయ జాతీయ రహదారి

పాడేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. కొయ్యూరులో బుధవారం 40.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తరువాత తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ... మిగతా 8వ పేజీలో

అరకు పార్లమెంటు పరిధిలో బీజేపీ నుంచి ముగ్గురి సస్పెన్షన్

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంటు పరిధిలో బీజేపీ నుంచి ముగ్గురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ పార్లమెంటు ఇన్‌చార్జి పరశురామరాజు బుధవారం తెలిపారు. పార్వతీపురానికి చెందిన నిమ్మక జయరాజు, రంపచోడవరం నుంచి కేవీవీ సత్యనారాయణ రెడ్డి, హేమనాయక్‌లు పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించి, వ్యతిరేక చర్యలకు పాల్పడినందున చర్యలు చేపట్టామన్నారు.

పార్టీలో ఏ స్థాయి నాయకులైనా సిద్ధాంతాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఇది కీలకమైన ఎన్నికల సమయం కాబట్టి వెన్నుపోటు రాజకీయాలను పార్టీ సహించదని స్పష్టంచేశారు.

కాఫీ చెర్రీకి మంచి ధర

- సీజన్ చివర్లో పెరిగిన రేటు
- కిలో రూ.165కు కొనుగోలు చేస్తున్న వర్తకులు
- గిరిజన రైతుల ఆనందం


జీకేవీధి రైతులు కల్లంలో ఎండబెట్టిన కాఫీ చెర్రీ గింజలు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 17: సీజన్ చివర్లో కాఫీ చెర్రీ(గుల్ల)కి మంచి ధర లభించింది. బుధవారం జీకే వీధి మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు కిలో కాఫీ చెర్రీ గింజలను రూ.165కు కొనుగోలు చేశారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలో కాఫీ చెర్రీ గింజలను ప్రైవేటు వర్తకులు రూ.125 నుంచి రూ.135 మధ్య కొనుగోలు చేశారు. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చెర్రీ కిలో రూ.145 ధరకు కొనుగోలు ప్రారంభించింది. దీంతో ప్రైవేటు వర్తకులు సైతం జీసీసీ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేశారు. అయితే పదిహేను రోజుల కిందట అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గాయని ప్రైవేటు వర్తకులు ధర తగ్గించేశారు. జీసీసీ అధికారులు సైతం కాఫీ కొనుగోలులో వెనకడుగు వేశారు. అయితే ప్రస్తుతం ఒకేసారి కాఫీ చెర్రీ ధర పెరిగింది. జీసీసీ ధర పెంచకపోయినప్పటికి ప్రైవేటు వర్తకులు కిలో చెర్రీ గింజలను రూ.165 ధరకు కొనుగోలు చేస్తున్నారు. కాఫీ గింజలను ముందుగా విక్రయించుకున్న రైతులు ధర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తుంటే, ప్రస్తుతం గింజలను మార్కెటింగ్ చేసుకుంటున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల మండలంలో పలుచోట్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

కోడ్ కూసి నెల.. రంగులు మారకుంటే ఎలా..?

- ఇప్పటికీ వాటర్ ట్యాంకులు, శిలాఫలకంపై కనిపిస్తున్న వైసీపీ జెండా రంగులు
- పట్టించుకోని అధికారులు
- విస్తుపోతున్న ప్రజలు

మాడుగుల/ మాడుగుల రూరల్, ఏప్రిల్ 17 : ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తూ.చ. తప్పక పాటించడం ఆయా శాఖల విధి. అందుకే పంచాయతీ అధికారి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఎన్నికల సమయాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ.. సదరు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుంటారు. కానీ మాడుగుల మండలంలో పలుచోట్ల భిన్నంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో ఇప్పటికీ వాటర్ ట్యాంకులపై వైసీపీ జెండా రంగులు కనిస్తుండడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు.



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శిలాఫలకానికి ఉన్న రంగులు



గదబవీధిలో ప్రస్తుతం వాటర్ ట్యాంక్‌కు ఉన్న రంగులు



లోవ గవరవరంలో వైసీపీ జెండా రంగులు మారని వాటర్ ట్యాంకు

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో దాదాపు నెల రోజుల క్రితం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలకు ముసుగులు ధరించాలి. పార్టీల జెండాలు ఎక్కడా అనుమతి లేకుండా ఏర్పాటు చేయరాదు. అలాగే, అధికారంలో ఉండే పార్టీల జెండా రంగులు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన వాటిపై ఉండరాదు అన్నది నిబంధన. కానీ మండలంలోని పలుచోట్ల ఇప్పటికీ అధికార పార్టీ వైసీపీ జెండాకు చెందిన రంగులు దర్శనమిస్తుండడాన్ని చూసి పలువురు నివ్వెరపోతున్నారు. ఎల్.పొన్నవోలు పంచాయతీ లోవ గవరవరం, గదబవీధి గ్రామల్లో గల రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన ఆ పార్టీ జెండా రంగులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ రంగులను తొలగించాల్సి ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అదే విధంగా మాడుగులలో వెలుగు క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా మార్టును స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌లోకి వెళ్లేందుకు ఎంట్రన్స్‌లో ఇనుప గేట్లు ఉన్నాయి. వాటికి సైతం వైసీపీ జెండా రంగులు వేసేశారు. అలాగే ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లేందుకు కొత్తగా తారురోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ప్రస్తుతం ఈ శిలాఫలకంపై ఉన్న పేర్లు కనిపించకుండా కాగితాలు అంటించినప్పటికీ, శిలాఫలకానికి వేసిన వైసీపీ జెండా రంగులు మాత్రం తొలగించలేదు. వీటిని చూసినవారు ఎన్నికల కమిషన్ ఆదేశాలను సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



మాడుగులలో మహిళా మార్టు గేట్లకు వైసీపీ రంగులు



మార్ట్ ముందు జెండా దిమ్మకు వైసీపీ రంగులు



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



క్రైం... crime news

పెదగోగాడ గెడ్డలో పడి ఆర్మీ ఉద్యోగి మృతి

చీడికాడ, ఏప్రిల్ 17: బైక్‌పై వెళుతున్న ఆర్మీ ఉద్యోగి ప్రమాదవశాత్తు గెడ్డలోపడి మృతి చెందినట్టు ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరం గ్రామానికి చెందిన పడాల వరహాలు (32) హైదరాబాద్‌లోని ఆర్మీలో పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సెలవుపై స్వగ్రామానికి విచ్చేశారు. మంగళవారం సాయంత్రం అత్తవారి గ్రామం అయిన దేవరాపల్లి మండలం వాకపల్లి వెళ్లేందుకు వరహాపురం మీదుగా పెదగోగాడ రోడ్డులో బైక్‌పై వెళుతున్నారు. అయితే పెదగోగాడ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గెడ్డలో బైక్ అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందారని ఎస్ఐ వివరించారు. బుధవారం సాయంత్రం పశువులు మేపుతున్న పెదగోగాడకు చెందినవారు మృతదేహాన్ని చూసి తమకు ససమాచారం అందించారన్నారు. దీంతో ఏఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. బుధవారం రాత్రి మృతుడి తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా వరహాలుకు మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్య, రెండేళ్ల బాలుడు ఉన్నారు.



పడాల వరహాలు (ఫైల్)

14 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 17: మండలంలోని దార్లపూడి వద్ద బుధవారం 14 మద్యం బాటిళ్లను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తరలిస్తుండగా దార్లపూడిలో పట్టుకొని, వాటిని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: ప్రమాదవశాత్తూ మేడ మెట్ల పైనుంచి జారిపడి తీవ్రగాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. తుమ్మపాల గ్రామానికి చెందిన దాసరి కృష్ణ (44) ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంటి రెండో ఫ్లోర్‌లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైందన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: పూడిమడకరోడ్డులోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద బుధవారం ఒక వ్యక్తి నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. కశింకోట మండలం జమాదులపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు మద్యం కొనుగోలు చేసి స్వగ్రామం వెళుతుండగా జాతీయ రహదారి జంక్షన్‌లో పట్టుకున్నామన్నారు. అతని వద్ద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం చేసిన సీఎం

- లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులను నమ్మించి తీరని అన్యాయం చేశారని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. బుధవారం జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. 2017 మార్చి 23న విజయవాడలో బాధితులు దీక్ష చేపట్టగా శిబిరాన్ని సందర్శించిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో బాధితులకు ప్రతి పైసా చెల్లిస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చాక కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉత్తరాంధ్రలో ఆరు లక్షల మంది ఉన్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది అగ్రిగోల్డ్ బాధితులు చనిపోయారని, వారికి రూ.మూడు లక్షలు అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటిస్తే జగన్ రూ.పది లక్షలు ప్రకటించి విడుదల చేయలేదన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీకి రూ.20వేల కోట్ల ఆస్తులున్నాయని ప్రభుత్వం ప్రకటించి కూడా బాధితులకు న్యాయం చేయకపోవడాన్ని బాబ్జీ తప్పుపట్టారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటన చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కె.రమణ, కేఎం నాయుడు, కె. నరసింగరావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాబ్జీ

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 17: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

ఎర్నాకులం-పాట్నా-ఎర్నాకులం అన్ రిజర్వ్‌డ్

06085 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.30 గంటలకు పాట్నా చేరుతుంది. తిరిగి ఈనెల 22 నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజాము 1.05 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

బెంగళూరు-హౌరా-బెంగళూరు

06585 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి మే 24 వరకు ప్రతి శుక్రవారం 00.30 గంటలకు (గురువారం అర్ధరాత్రి 12.30) ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి శుక్రవారం రాత్రి 7.25 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.00 గంటలకు హౌరా చేరుతుంది. తిరిగి ఈనెల ఈనెల 20 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 3.03 గంటలకు దువ్వాడ, రాత్రి 8.10 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది.

ప్రభుత్వ మద్యం షాపు సూపర్‌వైజర్‌పై కేసు

- ఆరు మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టివేత

పాయకరావుపేట, ఏప్రిల్ 17 : పట్టణంలోని ఓ ప్రభుత్వ మద్యం షాపులో సూపర్‌వైజర్ బుధవారం ఉదయం ఎటువంటి అనుమతుల్లేకుండా ఆరు మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం పట్టణ శివారులో ఎస్ఐ జోగారావు, సిబ్బంది వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో పట్టణంలోని ఓ ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్ కోనేటి నాగవెంకటపద్మారావు ఎటువంటి అనుమతుల్లేకుండా ప్లాస్టిక్ కవర్‌లో ఆరు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ జోగారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావుని వివరణ కోరగా.. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

సింహాచలం, ఏప్రిల్ 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం నివేదన, మంగళా శాసనములు చేసి, 7.30 గంటలకు భక్తులకు స్వామి వారి దర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 11.30 గంటలకు మహా నివేదన (రాజభోగము) కావడంతో 12.30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 7 తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని అధికారులు ప్రకటించారు. 19న రాత్రి 9.30 నుంచి స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 24న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటల నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ) నిర్వహిస్తారు.



సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ నెల 24 వరకు ప్రతిరోజు రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తారు. 18న స్వామివారి కొట్నాల ఉత్సవం పురస్కరించుకుని మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు. 24న వినోదోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 11.30 నుంచి మహాసంప్రోక్షణ, ఆరాధన, బాలభోగం, రాజభోగము నివేదనలు కారణంగా 2.30 వరకు దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 6 గంటలకు శ్రీపుష్పయాగము, ఉంజలసేవ, సంవాదసేవల కారణంగా సాయంత్రం 6 నుంచి దర్శనాలు నిలిపివేయనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

ఉత్సవాలను పురస్కరించుకుని కొన్ని ఆర్జిత సేవలను కూడా రద్దు చేస్తున్నట్టు దేవస్థానం అధికారులు ప్రకటించారు. ప్రధానంగా సుప్రభాత సేవ, రెండు పూటల ఆరాధన సేవ టికెట్లు రద్దు చేశారు. 18 నుంచి 25 వరకు రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవు. ఈ మేరకు ఏప్రిల్ 18 నుంచి మే 4 వరకు వరకు ఆలయంలో జరిగే ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు.

కుమార్తెతో పాటు వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 17: కుమార్తెతో వివాహిత అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. శారదానగర్‌కు చెందిన పలివెల నీలమ్మ, తన కుమార్తె చరిత్రశ్రీను వెంట బెట్టుకుని మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదని భర్త ఆనంద్ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రమేశ్ దంపతులు

నక్కపల్లి, ఏప్రిల్ 17: ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద బుధవారం ఉదయం జరిగిన సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. సీఎం రమేశ్ దంపతులకు ఎన్డీఏ నాయకులు గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు.



స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ దంపతులు

ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో మాజీ సర్పంచ్‌కి టోకరా

- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు అపహరణ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 17 : ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పేరుతో మాజీ సర్పంచ్‌కి టోకరా వేసి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలతో ఇద్దరు దుండగులు పరారయ్యారు. ఇందుకు సంబంధించి బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని మంగళాపురం పంచాయతీ మాజీ సర్పంచ్ అల్లంకి వెంకటఅప్పారావు బుధవారం తన స్వగ్రామం నుంచి స్కూటీ వాహనంపై చోడవరం బయలుదేరారు. బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట దాటగానే వెనకనుంచి బైక్‌పై ఇద్దరు ఆగంతకులు వచ్చి అతని స్కూటీకి అడ్డంగా బైక్‌పెట్టి ఆపారు. తాము ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అని చెప్పి, స్కూటీలో గల బ్యాగ్‌ను తనిఖీ చేశారు. ఇద్దరిలో ఒకరు తెలుగు, మరొకరు హిందీలో మాట్లాడారు. బ్యాగ్‌లో రూ.నాలుగు వేల నగదు కనిపించింది. అలాగే, వెంకటఅప్పారావు ఒంటిపై బంగారు ఆభరణాలను చూశారు. ఒంటిపై అంత బంగారం పెట్టుకుని ప్రయాణిస్తే ఎన్నికల నియమావళికి విరుద్ధమని చెప్పి, ఒంటిపై ఉన్న బంగారం చైన్‌ను స్కూటీలో ఉన్న బ్యాగ్‌లో వేశారు. ఐదు ఉంగరాలతో పాటు బ్రాస్‌లెట్‌ను మరో కాగితంలో పెట్టి పొట్లాంలా కట్టారు. ఆ పొట్లాంను బ్యాగ్‌లో వేసినట్టు నటించి బ్యాగ్ జిప్ వేసి స్కూటీలో పెట్టారు. చైన్‌తో పాటు బంగారం ఆభరణాల పొట్లాం కూడా బ్యాగ్‌లో పెట్టారని ఆయన భావించారు. అక్కడి నుంచి జాగ్రత్తగా వెళ్లమని చెప్పిన ఆగంతకులు బైక్‌పై వేగంగా వడ్డాది వైపు వెళ్లిపోయారు. అనంతరం అనుమానం వచ్చిన వెంటఅప్పారావు స్కూటీలో ఉన్న బ్యాగ్‌ను తీసి చూడగా చైన్ మాత్రమే బ్యాగ్‌లో కనిపించింది. ఉంగరాలు, బ్రాసెట్ ఆభరణాలు పొట్లాం కనిపించక పోవడంతో తాను మోసపోయానని గుర్తించి స్కూటీపై వారిని వెంబడించారు. వడ్డాది కూడలి చేరుకునే సరికి ఆగంతకులు బైక్ కనిపించలేదు. ఆగంతకులు నాలుగు తులాల ఉంగరాలు, నాలుగు తులాల బ్రాసెట్ మొత్తం ఎనిమిది తులాల బంగారం ఆభరణాలు తస్కరించారని బాధితుడు వాపోయారు. ఈ మేరకు 100 నెంబరుకి ఫోన్ చేసి సమాచారం అందించినట్టు ఆయన తెలిపారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

FLAT FOR SALE

★ 3 BHK 2750 Sft. & 8 yrs. Old, Total Cupboard Works, Sea View, Each Floor One Flat, Two Car Parking, Seashark Apt., Flat No.302, near by TAJ Hotel, R.K.Beach, Vizag. Cont.: 9849188559 AJV_183096

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలి



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సమర్థులైన వారిని ఎన్నుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలు గుర్తించి, ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపగలిగే సమర్థత ఉన్న అభ్యర్థిని గెలిపించుకోవాలి. కుల, మత, వర్గ, ప్రాంతీయ వాదాలకు తావులేకుండా సమర్థతను పరిగణనలోకి తీసుకోవాలి. సమర్థనాయకుడితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గుర్తించాలి.

- ఎంవీవీటీ ఆచారి, బియ్యం వ్యాపారి, అశోక్‌నగర్

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం రావాలి



గత ఐదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. కొన్నిరకాల సరకుల ధరలు రెట్టింపు అయ్యాయి. ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచకుండా సంక్షేమ పథకాలను ఎడాపెడా అమలు చేయడం సరికాదు. పాలకులు సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రాన్ని తిరుగమన దిశగా తీసుకెళ్లారు. ఇటువంటి తరుణంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్లగల పాలకులు రాష్ట్రానికి ఎంతో అవసరం. వచ్చే ఎన్నికల తరువాత ఇటువంటి ప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నాను.

- ఆళ్ల నూకేశ్వరరావు, తుమ్మపాల షుగర్స్ మాజీ ఉద్యోగి, అనకాపల్లి

సేవ చేసే వారినే ఎన్నుకోవాలి



ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చే నాయకులను పాలకులుగా ఉంటే అభివృద్ధి సాధ్యం. అక్రమంగా ఆస్తులను కూడబెట్టడం, కాపాడుకోవడానికి పదవుల్ని అడ్డుపెట్టుకునే వారిని తరిమికొట్టాలి. స్థానిక సమస్యలు తెలిసి, పరిష్కారానికి సమర్థంగా పనిచేయగల నేతలను ఎన్నుకోవాలి. నిత్యం అందుబాటులో ఉండే వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే సరైన న్యాయం జరుగుతుంది.

- పి.నాగేశ్వరరావు, కాంట్రాక్టర్, గోపాలపట్నం

ఉపాధి చూపించే సామర్థ్యం అవసరం



యువతకు ఉపాధి చూపించగలిగే నేతకు ఓటు వేసి ఎన్నుకుంటే సమాజానికి మంచి జరుగుతుంది. వ్యవసాయ, పారిశ్రామిక, చేతివృత్తుల రంగాల్లో అనుభవం ఉన్న అభ్యర్థులే మేలు. యువతకు ఉపాధి విషయంలో చేయూత ఇచ్చేవారినే ఎన్నుకోవాలి.

- తిరునగరి రాజా, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్, పెదగంట్యాడ

సేవాభావం ఉండాలి



సేవాభావం కలిగిన వారిని చట్టసభలకు ఎన్నికోవాలి. ఆస్తులు కాపాడుకునేందుకో, ఆస్తులు పెంచుకునేందుకో, అధికారం కోసమో చట్టసభలకు వెళ్లాలనుకునేవారిని ఓటర్లు తిరస్కరించాలి.పోటీలో ఉన్న అభ్యర్థుల్లో మంచివారిని ఎన్నుకోవడం ద్వారా సమాజానికి కొంతవరకు మేలుచేసినట్టే. ఐదేళ్ల పరిపాలించే ప్రతినిధులను ఎంపిక చేయడంలో ఏమరుపాటు ప్రదర్శిస్తే శిక్ష వేసుకున్నట్టే.

- యు.రాములునాయుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, గాజువాక

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



దేశం కంచుకోట సౌత్

సెగ్మెంట్ స్కాన్ | విశాఖ దక్షిణం



నియోజకవర్గం ఏర్పడిన తరువాత మూడుసార్లు ఎన్నికలు



ద్రోణంరాజు శ్రీనివాస్

- రెండుసార్లు టీడీపీ అభ్యర్థి గెలుపు
- 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీ... అయినా టీడీపీ అభ్యర్థి విజయం
- తాజా ఎన్నికల్లో కూటమిగా ఏర్పడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ
- పొత్తులో భాగంగా జనసేనకు కేటాయింపు
- ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్
- గెలుపు నల్లేరుమీద నడకేనని కూటమి నేతల్లో విశ్వాసం



వాసుపల్లి గణేష్‌కుమార్



వంశీకృష్ణ శ్రీనివాస్

- మరోవైపు వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలుపు... ఆ తరువాత వైసీపీలోకి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా గుర్తింపు పొందింది. నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడిన 'సౌత్' 2009లో ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరగ్గా రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీ చేశాయి. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థి విజయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్డుకోలేకపోయారు. తాజా ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పోటీకి దింపాయి. నియోజకవర్గ గత చరిత్రను బట్టి చూస్తే కూటమి అభ్యర్థి విజయం నల్లేరుమీద నడకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

దక్షిణ నియోజకవర్గంలో ముస్లింలు, క్రైస్తవులు, మత్స్యకారులు, బ్రాహ్మణులు, కాపులు, వెలమ, చేనేత (పద్మశాలి), యాదవులతో పాటు మార్వాడీలు ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్, ప్రజారాజ్యం పార్టీ నుంచి కోలా గురువులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 11 మంది పోటీ చేశారు. అప్పటికి నియోజకవర్గంలో 1,74,557 మంది ఓటర్లు ఉండగా, 1,28,907 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో 45,971 (35.66 శాతం) కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాసరావుకు దక్కగా, ప్రజారాజ్యంపార్టీ అభ్యర్థి కోలా గురువులుకు 45,630 లభించాయి. దీంతో 341 ఓట్లు స్వల్ప తేడాతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 1,97,541కి పెరిగింది. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి తిరిగి వాసుపల్లి గణేష్‌కుమార్, వైసీపీ నుంచి కోలా గురువులు, కాంగ్రెస్ పార్టీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్ పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 66,686 (51.45 శాతం) ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కోలా గురువులుకు 48,370 (37.32 శాతం), కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కి 8,280 (6.39 శాతం) ఓట్లు లభించాయి. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ 18,316 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మళ్లీ వాసుపల్లి గణేష్‌కుమార్, వైసీపీ నుంచి ద్రోణంరాజు శ్రీనివాస్, జనసేన నుంచి గంపల గిరిధర్, బీజేపీ నుంచి కొప్పల రామ్‌కుమార్ పోటీ చేశారు. నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,09,356కు పెరిగినప్పటికీ 1,25,701 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 52,172 (41.5 శాతం) ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కు 48,443 (38.15 శాతం) ఓట్లు వచ్చాయి. జనసేన పార్టీ అభ్యర్థి గంపల గిరిధర్‌కు 18,119 (14.41 శాతం) ఓట్లు, బీజేపీ అభ్యర్థి కొప్పుల రామ్‌కుమార్ 2,397 (1.91 శాతం) దక్కాయి. దీంతో వరుసగా రెండోసారి కూడా విజయం టీడీపీ అభ్యర్థినే వరించింది. తాజాగా వచ్చే నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన వంశీకృష్ణశ్రీనివాస్ బరిలో నిలవగా, గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచి, ఆ తర్వాత అధికార పార్టీలో చేరిన వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇద్దరు నేతలు ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం ముమ్మరం చేశారు.

వాసుపల్లికి ముప్పేట వ్యతిరేకత

వైసీపీ తరపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు టికెట్ ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే ఓడిస్తామంటూ ఆయన సొంత సామాజిక వర్గానికి చెందినవారే ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందు సమావేశమై అధికార పార్టీకి అల్టిమేటం ఇచ్చారు. ఇక వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న నేతలు కూడా వాసుపల్లి నాయకత్వాన్ని అంగీకరించడం లేదు. ఇదే కారణంతో కొంతమంది కార్పొరేటర్లు కూడా ఆ పార్టీని వీడారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక నియోజకవర్గంలో బ్రాహ్మణ సామాజిక వర్గంలో మంచి పట్టు కలిగిన సీతంరాజు సుధాకర్ నిన్నమొన్నటి వరకూ వైసీపీలో ఉన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. వాసుపల్లి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీకి రాజీనామా చేశారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణశ్రీనివాస్‌కు మద్దతు ప్రకటించారు. ఆయన నేడో, రేపో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు చెబుతున్నారు. వీటన్నింటితోపాటు 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ విడివిడిగా పోటీ చేయడంతో వైసీపీ వ్యతిరేక ఓటు కూడా ఆయా పార్టీల మధ్య చీలిపోయింది. టీడీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 52,172 (41.5 శాతం), జనసేన పార్టీ అభ్యర్థి గంపల గిరిధర్‌కు 18,119 (14.41 శాతం) ఓట్లు, బీజేపీ అభ్యర్థి కొప్పల రామ్‌కుమార్ 2,397 (1.91 శాతం) పడ్డాయి. వైసీపీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌కు 48,443 (38.15 శాతం) ఓట్లు లభించాయి. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ గాలివీచినప్పుడే దక్షిణ నియోజకర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. పైగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపుతున్నాయి. గత ఎన్నికల్లో ఆ మూడు పార్టీలకు లభించిన ఓట్లు కలిపితే 72,688 (58 శాతం). ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో తమ అభ్యర్థి విజయం తథ్యమని కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) నేతలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

అక్కడ నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేలు

ఇదీ 'చీడికాడ మండలం' ప్రత్యేకత

- 1978 నుంచి ప్రతి ఎన్నికల్లో చీడికాడ మండల వాసుల పోటీ
- మాడుగుల నియోజకవర్గానికి ఇప్పటికి 14సార్లు ఎన్నికలు... ఏడుసార్లు చీడికాడ మండలవాసుల గెలుపు



కురచా రామునాయుడు (మాజీ ఎమ్మెల్యే)



రెడ్డి సత్యనారాయణ, మాజీ మంత్రి



గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే

అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల 'చీడికాడ' జనాభాపరంగా చాలా చిన్న మండలం. అయితే మాడుగుల నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 1978 నుంచి చీడికాడ మండల వాసులే పోటీ చేస్తున్నారు. 2019 వరకూ మాడుగుల నియోజకవర్గానికి 14 సార్లు ఎన్నికలు జరగ్గా చీడికాడ మండలవాసులే ఏడుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1978 నుంచి నేటి వరకూ ప్రతి ఎన్నికల్లోను చీడికాడ ప్రాంతవాసులు పోటీ చేస్తున్నారు. మండలంలో అప్పలరాజుపురం గ్రామానికి చెందిన కురచా రామునాయుడు 1978లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1985, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాగే మండలంలోని పెదగోగాడ గ్రామానికి చెందిన రెడ్డి సత్యనారాయణ 1983, 1985, 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో ఆరుసార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీచేయగా ఒక్క 2004 మినహాయించి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు రాష్ట్ర మంత్రిగాను, అంచనాల కమిటీ చైర్మన్‌గాను, టీటీడీ బోర్డు సభ్యునిగాను పలుమార్లు పనిచేశారు. అదేవిధంగా అప్పలరాజుపురం గ్రామానికి చెందిన గవిరెడ్డి రామానాయుడు 2004 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గాను, 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేయగా 2009లో గెలుపొందారు. అప్పలరాజుపురం గ్రామానికే చెందిన గవిరెడ్డి సన్యాసినాయుడు 1999లో అన్న టీడీపీ తరపున, 2019లో జనసేన తరపున పోటీ చేసి ఓటమిచెందారు. అదే గ్రామానికి చెందిన కురచా నారాయణమూర్తి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అలాగే చీడికాడ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిచెందారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయన మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన చిరుమూరి శివాజీరాజు 2009, 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మాడుగుల నియోజకవర్గంలో మిగిలిన మండలాల కంటే 'చీడికాడ' చిన్న మండలం. జనాభా, ఓటర్లు తక్కువ. ఒకే వ్యక్తి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత ఈ మండలవాసి (రెడ్డి సత్యనారాయణ)కే దక్కుతుంది.

● చీడికాడ

నగదు తీసుకెళ్తున్నారా...

- ఎన్నికల వేళ జాగ్రత్తలు తప్పనిసరి
- రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే

ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని చోట్లా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాలతో పాటు ప్రజలు తమతో పాటు తీసుకెళ్తున్న బ్యాగులు, ఇతర వస్తువులు సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే స్వాధీనం చేసుకుంటారు. కొన్నిసార్లు సొంత పనుల మీద ఇతర ప్రాంతాలకు నగదు తీసుకువెళ్తున్నా ఇబ్బందులు తప్పవు. ఎన్నికల నియమ, నిబంధనల మేరకు తగిన ఆధారాలతో అధిక మొత్తంలో నగదు తీసుకువెళ్లవచ్చు. ఆ వివరాలివి..

ఫైనాన్స్, చిట్టీల వ్యాపారులు

చిట్టీలు, ఫైనాన్స్ సంస్థల్లో ప్రతి రోజు భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్‌ల ఏజెంట్‌ల వద్ద రూ.లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆ రోజు చేసిన కలెక్షన్ పద్దులు, బాకీ ఉన్న నగదు, వసూలైన నగదు ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్‌ల సంతకంతో కూడిన ప్రతులు తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలి.

బంగారు ఆభరణాల కొనుగోలు

శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు, ఇతర వస్తువులు కొనుగోలుకు నగదు తీసుకు వెళ్తారు. శుభకార్యాల కోసం నగదు తీసుకువెళ్లే వారు తమ వెంట శుభలేఖ ఉంచుకోవాలి. అదే విధంగా పోలీసులు అడిగిన అన్ని వివరాలకు పూర్తి సమాచారం ఇవ్వాలి.

బ్యాంకు లావాదేవీలు....

బ్యాంకు లావాదేవీలు రూ.50వేలకు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే చెక్కు జెరాక్స్, పాస్‌బుక్ దగ్గర ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు వీత్‌డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు జాగ్రత్తచేయాలి (కొన్ని బ్యాంకుల ఏటీఎంలో ప్రస్తుతం రోజు వారీ పరిమితి 20వేలుగా ఉంది). ఒకవేళ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లే ఆ నగదుకు సంబంధించిన అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరు, ఎందుకు ఇచ్చారో ఆధారాలుండాలి. పాస్‌బుక్ కూడా ఉండాలి.

ఆస్పత్రి బిల్లులు చెల్లింపులు

అత్యవసర సమయాల్లో అధికమొత్తంలో ఆస్పత్రి బిల్లులు చెల్లించక తప్పదు. ఇలాంటి సమయంలో రోగి మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆస్పత్రి బిల్లులకు సంబంధించి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.

విద్యాసంస్థల ఫీజులు

పిల్లల చదువుల కోసం సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలకు ఫీజు చెల్లించాలంటే నగదు తీసుకువెళ్లకు తప్పదు. నగదు ఎందుకు తీసుకువెళ్తున్నారనే విషయంలో సంబంధిత యాజమాన్యం రశీదులు ఉండాలి. నగదు చెల్లించకముందు ఫీజు కట్టాలనే నోటీసులు వెంట ఉంచుకోవాలి. అవసరమైనంత మేరకు ఆన్‌లైన్‌లో పే చేయడం మేలు.

● ఉక్కుటౌన్‌షిప్




తగరపువలస గోస్తనీ చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ సిబ్బంది (ఫైల్)



పద్మనాభం మండలం రేవిడి గ్రామం

నాడు నియోజకవర్గ కేంద్రంగా రేవిడి

1955 ఎన్నికల్లో పద్మనాభరాజు, 1962లో కోళ్ల అప్పలనాయుడు గెలుపు



తొలి ఎమ్మెల్యేగా పని చేసిన పద్మనాభరాజు



రెండో ఎమ్మెల్యేగా ఎన్నికైన కోళ్ల అప్పలనాయుడు

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తరువాత నిర్వహించిన తొలి సార్వత్రిక ఎన్నికలలో పద్మనాభం మండలం రేవిడి గ్రామం శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. అప్పటికే ఈ గ్రామం బ్రిటీషు ప్రభుత్వ ఏలుబడిలో భూముల శిస్తు వసూళ్లను, ఇతర కార్యకలాపాలను చూసే ఫిర్కా (రెవెన్యూ బ్లాక్)గా ఉండేది. దీంతో పాటు ఈ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు భూపతిరాజు వెంకటపతిరాజు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం భూస్వాముల నియోజక వర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో రేవిడికి ప్రత్యేక గుర్తింపు లభించింది. అలాగే భారత ఎన్నికల సంఘం ఎనిమిదో ప్రధాన ఎన్నికల కమిషనర్ (1986-90)గా పనిచేసిన ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి కూడా ఈ గ్రామానికి చెందినవారే. ఈ నేపథ్యంలో తొలి (1955), మలి (1962) సార్వత్రిక ఎన్నికల వరకు రేవిడి నియోజకవర్గ కేంద్రంగా కొనసాగింది. 1955లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాకర్లపూడి విజయరాఘవ సత్యనారాయణ పద్మనాభరాజు (కేవీఆర్ఎస్ పద్మనాభరాజు) ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి, 1962లో కోళ్ల అప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955 ఫిబ్రవరి 11న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో ప్రజా సోషలిస్టు పార్టీ తరపున పోటీ చేసిన కేవీఆర్ఎస్ పద్మనాభరాజు సమీప ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి గుజ్జు రామునాయుడుకు 11,891 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పద్మనాభరాజుకు 15,217 ఓట్లు రాగా, రామునాయుడుకు 3,326, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన మజ్జి ఆదినారాయణకు 2,945 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన చెల్లూరి చిట్టిబాబుకు 2,855 ఓట్లు లభించాయి. ఇక 1962 ఫిబ్రవరి 19న జరిగిన శాసనసభ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కోళ్ల అప్పలనాయుడు తన సమీప ప్రత్యర్థి సుంకర సత్యనారాయణపై 5,339 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అప్పలనాయుడుకు 14,823 ఓట్లు రాగా, జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి సుంకర సత్యనారాయణకు 9,484, స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన చెల్లూరి రామారావునాయుడుకు 8,008 ఓట్లు లభించాయి. 1967 సార్వత్రిక ఎన్నికల నాటికి రేవిడి నియోజకవర్గం భీమిలి శాసనసభ నియోజకవర్గంలో విలీనం కావడంతో ఈ గ్రామం పూర్వ నియోజకవర్గ కేంద్రంగా చరిత్రలో నిలిచిపోయింది.

● పద్మనాభం


పాడేరు: సుంద్రుపుట్టు రామాలయం వద్ద బారులు తీరిన భక్తులు


కొయ్యూరు: కాకరపాడులో సీతారామ కల్యాణంలో పాల్గొన్న భక్తులు


అరకులోయ: చొంపి కొత్తవలసలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మన్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

పాడేరు రూరల్/కొయ్యూరు/చింతపల్లి/అరకులోయ/జి.మాడుగుల/ముంచంగిపుట్టు/హుకుంపేట/సీలేరు, ఏప్రిల్ 17: మన్యంలోని శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాడేరు మండలంలోని సుంద్రుపుట్టు రామాలయంలో సీతారాముల దర్శనానికి వేలాది మంది భక్తులు ఉదయం 6 గంటల నుంచే బారులు తీరారు. కిండంగి పంచాయతీ కేంద్రంలోని రామాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆలయ ధర్మకర్త బొర్రా నాగరాజు, విజయరాణి దంపతులు నిర్వహించిన కల్యాణంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఇరడాపల్లి, మినుములూరు, గుత్తులపుట్టు తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే కొయ్యూరు మండలంలోని రామాలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కాకరపాడు యువజన నేత కాకరి చంద్రరావు, పెద్దలు పాడి లోవరాజు, పొడుగు చంద్రరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. చింతపల్లి మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో సీతారాముల విగ్రహాలను పల్లకిలోనూ, చౌడుపల్లిలో మహిళలు శిరస్సుపై పురవీధుల్లో ఊరేగించారు. ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ లొంజ మహేంద్రనాథ్, ఆలయ కమిటీ సభ్యులు ఎంవీ రమణమూర్తి, తాడి రమణ, దేపూరి వెంగళయ్య, కంటా వెంకటరమణ పాల్గొన్నారు. అరకులోయలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. చొంపి కొత్తవలస కోదండ రామాలం, పానిరంగిణి, యండపల్లివలస, తాంగులగుడ తదితర గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పాల్గుణ, అరకు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు స్వామివారిని దర్శించుకున్నారు. జి.మాడుగుల, కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి, నుర్మతి తదితర గ్రామాల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవానికి తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం కల్యాణ మండపం ప్రాంగణంలో మహిళలతో కోలాటం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే సీలేరు మేజర్ పంచాయతీతో పాటు దుప్పులవాడ, వలసగెడ్డ, ధారకొండ కూడా శ్రీరామనవమి ఉత్సవాలను అత్యంగా వైభవంగా నిర్వహించారు. వలసగెడ్డ రామాలయం వద్ద ఏపీ జెన్‌కో ఇంజనీర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ అన్నసమరాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టు మండల పరిధిలో శ్రీరామనవమి ఘనంగా జరపుకున్నారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణం కన్నులపండవగా జరిగింది. పలువురు దంపతులు శ్రీరాముల సన్నిధిలో కల్యాణం జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

హుకుంపేట మండలంలోని అడ్డుమండ, గుడుగుపల్లి, హుకుంపేట, సూకూరు, ముల్యపుట్టు, బిర్సింగ్ బాకూరు, చిడిపుట్టు గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అడ్డుమండలోని సీతారాముల కల్యాణంలో అరకు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థిని డాక్టర్ తనుజరాణి, దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాడేరు: గడుగుపల్లిలో సీతారాములుకు పూజలు చేస్తున్న గిరిజన అర్చకులు

పాడేరులో విస్తృతంగా వాహన తనిఖీలు

పాడేరు రూరల్, ఏప్రిల్ 17: జిల్లా కేంద్రం పాడేరులో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో బుధవారం నుంచి విస్తృతంగా వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని పాడేరు-విశాఖ ప్రధాన రహదారిలోని వంతాడపల్లి అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు భారీగా మొహరించి వచ్చిపోయే వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. కార్లు, జీపులు, బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వాహన తనిఖీలను విస్తృతం చేశామని ఈ సందర్భంగా ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

40 ఎకరాల్లో జీడిమామిడి తోట దగ్ధం

▸▸ ఆరుగురు రైతులకు రూ.20 లక్షల ఆస్తి నష్టం

కొయ్యూరు, ఏప్రిల్ 17: రొంగలికొత్తూరు పంచాయతీలోని చినమల్లవరం, మల్లంపేట గ్రామాల సరిహద్దులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 40 ఎకరాల్లో జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు రైతులకు దాదాపు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంపై బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మల్లంపేటలో కూడా జంగమయ్యకు చెందిన జీడిమామిడి తోట నుంచి మంటలు చెలరేగి పక్కనే ఉన్న తోటలకు క్షణాల్లో విస్తరించాయి. దీంతో జంగమయ్యకు చెందిన పది ఎకరాలు, కూడా తమ్మయ్యకు చెందిన పది ఎకరాలు, వరహాలుకు చెందిన పది ఎకరాలు, మాతే దేముడుకు చెందిన మూడు ఎకరాలు, మాతే రాజబాబుకు చెందిన ఐదు ఎకరాలు, మాతే పెంటయ్యకు చెందిన సుమారు మూడు ఎకరాల జీడిమామిడి తోటలు మంటల్లో కాలిపోయాయి. ఈ తోటల్లో పూత, పిందె మంటలకు పూర్తిగా కాలిపోయాయి. దీంతో సమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ నష్టంపై అంచనా వేసి ఐటీడీఏ ఆదుకునేలా తగిన చర్యలు చేపట్టాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

పాడేరు ఆస్పత్రిలో గిరిజన మహిళ మృతి

▸▸ అంబులెన్స్ సిబ్బంది లేకపోవడమే కారణమని కుటుంబీకుల ఆవేదన

పాడేరు రూరల్, ఏప్రిల్ 17: పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మంగళవారం రాత్రి గిరిజన మహిళ బొడ్డా చిలకమ్మ (45) మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్, సిబ్బంది అందుబాటులో లేకపోవడం తోనే చిలకమ్మ మృతి చెందారని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. హుకుంపేట మండలం బర్మన్‌గూడ గ్రామానికి చెందిన చిలకమ్మ మంగళవారం గుండెపోటుకు గురయ్యారు. కుటుంబీకులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అందించిన డాక్టర్ శ్రీలలిత పరిస్థితి విషమంగా ఉందని కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. అయితే పాడేరు అస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించేందుకు మంగళవారం రాత్రి 10 గంటల వరకు (సుమారు ఆరు గంటలు) అంబులెన్స్ డ్రైవర్, సిబ్బంది అందుబాటులో లేరని, దీంతో రాత్రి 10.30 గంటలకు చిలకమ్మ మరణించిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ ఉన్నప్పటికీ డ్రైవర్ లేకపోవడం, ఫోన్ స్విచాఫ్‌లో ఉండడం, 108 వాహనాలు అందుబాటులో లేకపోవడంతోనే చిలకమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మన్యంలో మినీ కేజీహెచ్‌గా పేరొందిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం విచారకరమని వాపోయారు. అధికారులు స్పందించి జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపర్చాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని వారు వేడుకున్నారు.


మృతి చెందిన బొడ్డా చిలకమ్మ

వైభవంగా మారెమ్మ గరగ అలంకరణ

▸▸ ఘటాలతో అగ్నిగుండంపై నడిచిన అమ్మవారి మాలధారులు

సీలేరు, ఏప్రిల్ 17: సీలేరు గ్రామదేవత మారెమ్మ ఉత్సవాల్లో బుధవారం అమ్మవారి గరగ అలంకరణ, అగ్నిగుండం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తొమ్మిది రోజుల పాటు అమ్మవారి దీక్షలను పాటించిన సీలేరు, డొంకరాయి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు తమిళ పూజారి సుబ్రహ్మణ్యశర్మ, డొంకరాయికి చెందిన అమ్మవారి భక్తుడు శ్రీను కంకణాలను కట్టారు. అనంతరం అమ్మవారి ఆలయం ఎదుట 18 అడుగుల అగ్నిగుండానికి కర్రలను పేర్చి అగ్నిదేవునికి, అమ్మవారికి పూజలను నిర్వహించారు. అలాగే అగ్నిగుండంను ముద్దకర్పూరంతో వెలిగించి మాలలు ధరించిన భక్తులు రెగ్యులేటర్ డ్యాం దిగువన గల కెనాల్ వద్దకు వెళ్లి అమ్మవారి గరగను అలంకరించారు. మాలలు ధరించిన కొంతమంది భక్తులకు నోటికి శులాలను గుచ్చుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని, ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం మీదుగా నడుచుకుంటూ ఆలయంలోకి ప్రవేశించారు. మొదటిగా అమ్మవారి గరగను ఎత్తుకున్న దండుపాటి శ్రీను అగ్నిగుండంపై నడుచుకుంటూ ఆలయ ప్రవేశం చేయగా, తరువాత మాలలు ధరించిన 70 మంది భక్తులు అగ్నిగుండంపై నడిచి తమ భక్తిని చాటారు. డొంకరాయికి చెందిన ఓ భక్తుడు తన కుమారుడ్ని ఎత్తుకుని అగ్నిగుండంపై నడవడం విశేషం. అగ్నిగుండం కార్యక్రమాన్ని సీలేరు, డొంకరాయి, మోతిగూడెం, ఒడిశాకు చెందిన వందలాది మంది భక్తులు వీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు, సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు నిర్వహించారు.


అగ్నిగుండంపై నడుస్తూ ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన అవసరం

పాడేరు రూరల్, ఏప్రిల్ 17: వంట గ్యాస్, అకస్మికంగా సంభవించే అగ్నిప్రమాదాలపై ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక కేంద్ర అధికారి కె.పెంటయ్యనాయుడు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఏపీఆర్ స్కూల్ ప్రాంగణంలోని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు వంట గ్యాస్ వినియోగించే సమయంలో అకస్మికంగా వచ్చే మంటలు, వాటి నివారణపై చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో ఉన్న విద్యార్థులకు అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్.బాలకృష్ణ, ఎల్.చంద్రశేఖర్, వెంకటేష్, శివాజీరాజు,పరమేశ్వరరావు, హేమంత్, రవిరాజు, కొండలరావు, రాము, గిరీష్, శివయ్య, త్రినాథ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి

▸▸ సీఆర్‌పీఎఫ్ ఏసీ వినీత

చింతపల్లి, ఏప్రిల్ 17: ఆదివాసీలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్-బి కంపెనీ అసిస్టెంట్ కమాండెంట్ వినీత సూచించారు. అన్నవరం పంచాయతీలోని కూర్మన్నపాలెం గ్రామంలో బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూర్మన్నపాలెం గ్రామాన్ని సీఆర్‌పీఎఫ్ దత్తత తీసుకున్నట్లు చెప్పారు. గ్రామంలో ఆదివాసీల అభ్యున్నతికి అవసరమైన అన్ని కార్యక్రమాలూ చేపడతామన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు, గంజాయి సాగు, రవాణాకు ఆదివాసీలు దూరంగా ఉండాలని, వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం గిరిజనుల సమస్యలు తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వృద్ధులు, మహిళలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ తుషార్ రంజన్, పీఆర్వో అన్వర్ బాషా, స్థానిక ఎస్‌ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు నగారా

... 5వ పేజీ తరువాయి

పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలున్నాయి. ఈ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 318 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2 లక్షల 44 వేల 922 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,18,154 మంది, మహిళలు 1,26,755 మంది, ఇతరులు 16 మంది ఓటర్లున్నారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలున్నాయి. ఈ ఆరు మండలాల పరిధిలో 304 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2 లక్షల 41 వేల 360 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,17,460 మంది, మహిళలు 1,23,894, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు కాల్ సెంటర్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమాలు. ప్రలోభాలు, దౌర్జన్యాలు, ఇతర సమస్యలను అధికారులకు ఫిర్యాదు చేసేందుకు గాను ప్రజల కోసం మూడు నంబర్లతో కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా జిల్లాలో ఎన్నికల నిబంధనల అతిక్రమణ, అక్రమ డబ్బు, మద్యం రవాణా, పంపిణీతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టడడం వంటి వాటిపై ఆయా నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలోని ప్రజలు ఎన్నికల సంబంధిత సమస్యలపై ఈ ల్యాండ్ లైన్ నంబర్లకు 08935 299912, 08935 299934, 08935 293448 ఫిర్యాదులు చేయవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్

... 5వ పేజీ తరువాయి

గాయాలయ్యాయి. ఇతనిని పినకోట పీహెచ్‌సీ అంబులెన్స్‌లో దేవరాపల్లి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుల్లో నాగరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, క్షతగాత్రుడు శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాము తెలిపారు.

తగ్గని భానుడి ప్రతాపం

... 5వ పేజీ తరువాయి

ఆరు గంటల నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు అవస్థలు పడుతున్నారు.

ఉష్ణోగ్రతలు ఇలా..

కొయ్యూరులో బుధవారం 40.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అనంతగిరిలో 36.2, అరకులోయలో 36.4, చింతపల్లిలో 37.2, డుంబ్రిగుడలో 39.4, జీకే వీధిలో 38.2, జి.మాడుగులలో 38.8, హుకుంపేటలో 35.4, ముంచంగిపుట్టులో 37.4, పాడేరులో 38.2, పెదబయలులో 37.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండ వేడికి తాళలేక ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మండల కేంద్రంలో బుధవారం 37.4 సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకావడంతో మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. జనం బయటకు రావడానికి సాహసించలేదు. ప్రస్తుతం ఎండలకు పలు చోట్ల మత్స్యగెడ్డ పాయలు పూర్తి స్థాయిలో అడుగంటిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతీయులు సైతం ఈ ఏడాది తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఫీజు పరేషాన్

... 5వ పేజీ తరువాయి

కత్తెర వేసింది. ఏటా రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు చెల్లిస్తామని ప్రకటించింది. దీనికి కూడా ప్రభుత్వం 'జగనన్న వసతి దీవెన' అనే పేరు పెట్టింది. అయితే, 2020-21, 2021-22 విద్యా సంవత్సరంలో మాత్రమే చెప్పినట్టుగా ప్రభుత్వం విద్యార్థులకు వసతి దీవెనను రెండు విడతల్లో చెల్లించింది. గత రెండేళ్లు ఒకవిడత చొప్పున మాత్రమే చెల్లించింది. అంటే, ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు కోత పెట్టింది. ప్రభుత్వం తెచ్చిన ఈ నూతన విధానాలపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాలకు సొంత గూడు ఎన్నడో?

... 5వ పేజీ తరువాయి

నిలిపివేశారు. అయితే పాత బిల్లులు గత నెలలో కాంట్రాక్టర్లకు విడుదలయ్యాయి. మిగతా పనులు చేస్తే బిల్లులు వస్తాయో? రావో అనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. ఈ 16 సచివాలయాల్లో కిముడుపల్లి సచివాలయ భవనం ఒక్కటే పూర్తయి ప్రారంభానికి నోచుకుంది. మిగతావన్నీ వివిధ స్థాయిల్లో పనులు నిలిచిపోయాయి. జామిగూడ, ఇంజరి గ్రామాల్లో భవన నిర్మాణానికి పునాది గోతులు తవ్వి వదిలేశారు. గిన్నేలకోట, కుంతుర్ల గ్రామాల్లో పిల్లర్ల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. సీతగుంటలో ఇద్దరు కాంట్రాక్టర్లు మారినా గోడల నిర్మాణం పూర్తికాలేదు. అడుగులపుట్టు రూడకోట, పర్రెడా, అరడకోట, గంపరాయి తదితర గ్రామాల్లో శ్లాబ్ స్థాయిలో పనులు నిలిచిపోయాయి. దీంతో 15 సచివాలయాలకు సొంత గూడు లేకుండాపోయింది. ఈ సచివాలయ భవన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.


పెదబయలులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఇంజరి సచివాలయం

మండలంలో సచివాలయ భవన నిర్మాణాల పరిస్థితి ఇది..

వ.సం	గ్రామం	ప్రస్తుత పరిస్థితి
1.	జామిగూడ	పునాది గోతుల స్థాయిలో
2.	ఇంజరి	పునాది గోతుల స్థాయిలో
3.	గిన్నేలకోట	పిల్లర్ల దశలో
4.	కుంతుర్ల	చివరి దశలో
5.	సీతగుంట	రెండో అంతస్థు శ్లాబ్ దశలో
6.	సీకరి	గోడల స్థాయిలో
7.	అడుగులపుట్టు	చివరి దశలో
8.	పర్రెడా	గోడల స్థాయిలో
9.	రూడకోట	చివరి దశలో
10.	అరడకోట	రెండో శ్లాబ్ దశలో
11.	గంపరాయి	విద్యుత్ వైరింగ్ దశలో
12.	పెదకోడపల్లి	మొదటి శ్లాబ్ దశలో
13.	లింగేటి	వైరింగ్ దశలో
14.	గోమంగి	ప్లాస్టింగ్ దశలో
15.	బొండపల్లి	చివరి దశలో
16.	కిముడుపల్లి	పూర్తి చేసి ప్రారంభం

సంక్షిప్తంగా..

కేజీబీవీ ఇంటర్ విద్యార్థినికి డీఈవో అభినందనలు

పాడేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ గ్రూపులో వెయ్యికి 915 మార్కులు సాధించి జిల్లాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాల్లోనే ప్రథమ స్థానంలో నిలిచిన స్థానిక కేజీబీవీ విద్యార్థిని పచ్చల హరిప్రియను డీఈవో బ్రహ్మాజీరావు బుధవారం అభినందించారు. పాడేరుకు చెందిన విద్యార్థిని చక్కని ప్రతిభ చూసి జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించడంపై కేజీబీవీ ఎస్‌వో చంద్రకళ, జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సూర్యకుమారి, ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా సమన్వయకర్త కె.భాస్కరరావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

లంబసింగిలో ఎక్స్‌కవేటర్ బోల్తా

చింతపల్లి, ఏప్రిల్ 17: నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలోని లంబసింగి ఘాట్‌లో ప్రమాదవశాత్తు ఓ ఎక్స్‌వేటర్ బోల్తాపడింది. దీంతో రెండు గంటల పాటు ఇరువైపులా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారుల నిర్మాణాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్ బుధవారం ఉదయం నర్సీపట్నం నుంచి లంబసింగి వస్తున్నది. లంబసింగి ఘాట్‌లోని బోడకొండమ్మ దేవాలయానికి ముందు ఉన్న మలుపు వద్ద అదుపుతప్పి రహదారికి అడ్డంగా ఎక్స్‌కవేటర్ బోల్తా పడింది. దీంత రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం స్థానికులు ఎక్స్‌కవేటర్ ఒక పక్కకు నెట్టడంతో వాహనాలు యథావిధిగా తిరిగాయి. ఈ ఘటనలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్ గాయపడ్డాడు.

22లోగా బ్యాలెట్ ఓటుకు ఫారం-12 అందించాలి

చింతపల్లి, ఏప్రిల్ 17: బ్యాలెట్ ఓటు కోసం ఈ నెల 22వ తేదీలోగా ఉద్యోగులు ఫారం-12 సమర్పించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం విలే కరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరవుతున్న వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు బ్యాలెట్ ఓటు కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు ఎన్నికల విధుల ఉత్తర్వులతో పాటు ఫారం-12 అందజేయడం జరిగిందన్నారు. ఫారం-12తో పాటు ఐడీ, ఆధార్, ఓటర్ ఐడీ కార్డులు, ఎన్నికల విధుల ఉత్తర్వుల నకళ్లు జతపర్చి రిటర్నింగ్ అధికారికిగాని, తహసీల్దార్‌కిగాని అందజేయాలన్నారు. నిర్దేశిత సమయం తరువాత అందజేసే దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి: సీఐ రమేష్

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 17: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ సూచించారు. మండలంలోని మారుమూల పనసపుట్టు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. అలాగే గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని సాగు చేసినా, తయారు చేసినా, విక్రయాలు చేపట్టిన శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె.రవీంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్రంగా పోటీ: వంతల సుబ్బారావు

చింతపల్లి, ఏప్రిల్ 17: కాంగ్రెస్ తనకు టికెట్ కేటాయించకపోవడంతో మనస్తాపానికి గురై స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు అన్నారు. మండలంలోని గడపరాయి గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, అభిమానాల మద్దతుతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. ఐదేళ్లుగా క్యాడర్‌ను బలోపేతం చేసి, ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకున్న తరుణంలో షర్మిలరెడ్డి పాడేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం లేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.చిరంజీవి, ఎం.గురుమూర్తి, ఎం.బాలరాజు, జి.బొజ్జన్న, పి.శ్రీనుబాబు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

జి.మాడుగుల, ఏప్రిల్ 17: గిరిజనుల సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్ కోరారు. మండలంలోని వంతల పంచాయతీ తియ్యమామిడి, బొడ్డపుట్టు, కుమ్మరిగుంట, వంటలమామిడి, మూటమర్రి, కర్లపల్లి, జర్రాయి, పెదలవలస గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. రానున్న ఎన్నికల్లో సీపీఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను మద్దతు తెలిపి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.సర్బునాయుడు, నాయకులు సీతారాం, భీమరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, ఏప్రిల్ 17: అరకు అసెంబ్లీ, పార్లమెంట్ సీపీఎం అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని పార్టీ నేత సురేంద్ర చెప్పారు. గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, వైసీపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గిరిజన ప్రాంతాలను ఆయా పార్టీలు నిర్వీర్యం చేశాయన్నారు. నాయకులు పోతురాజు, సురేష్‌కుమార్, సత్యనారాయణ, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ రెబల్‌గా పోటీ చేస్తా: రామన్న

అరకులోయ, ఏప్రిల్ 18: అరకు అసంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని పార్టీ నేత వంతల రామన్న తెలిపారు. రెండేళ్ల నుంచి వైసీపీ కార్యకలాపాల్లో చురుకైన పాత్రను పోషించానన్నారు. గిరిజనులకు సంపూర్ణ సేవలందించే అవకాశం కల్పుతుందని నమ్మి ప్రజాసేవకుడు కావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జి.మాడుగుల, ఏప్రిల్ 17: అడవుల్లో అగ్ని ప్రమాదాలు నివారించాలని అన్నవరం ఫారెస్టు సెక్షన్ అధికారి ఎస్.వెంకటరావు సూచించారు. మండలంలో బీరం పంచాయతీ పరిధిలోని వి.కోడాపల్లి గ్రామంలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే అడవుల్లో ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు ఎస్.శ్రీనివాస్‌ప్రసాద్, ఎల్.గంగరాజు, సిబ్బంది ఎం.బాలన్న పాల్గొన్నారు.